JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 06-05-2026
Medchal - Malkajgiri | Wednesday 06-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 339
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 339 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



# తమిళనాడు ప్రజలే నా బలం



2 లో

- ప్రజాస్వామ్య విజయానికి ఇది ఆరంభం.. విజయ్ ఎమోషనల్ ట్వీట్
- టీవీకే పార్టీ భవిష్యత్తులో తమిళనాడు రాజకీయాల్లో కీలక శక్తిగా మారుతుందని మీరు భావిస్తున్నారా?
- ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు?

**జయభేరి, చెన్నై, మే 5 :**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో 'తమిళగ వెట్రి కళగం' (TVK) అధ్యక్షుడు, హీరో విజయ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "నా గుండెల్లో మీకు ఎప్పటికీ గుడి ఉంటుంది.. అందరికీ వణకం" అంటూ ప్రారంభమైన ఆయన ట్వీట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

# సరైన పద్ధతిలో వినియోగిస్తే అందరికి మేలు



తెలంగాణ భవిష్యత్తు ప్రణాళిక పైన నిర్వహించిన సమావేశంలో ప్రముఖ ఆర్థిక నిపుణుడు, ఆర్బీఐ మాజీ గవర్నర్ శ్రీ రఘురామ్ రాజన్ పలు సూచనలు చేశారు. వారికి ధన్యవాదాలు. యువతలో నైపుణ్యాభివృద్ధి, పిల్లలకు పోషకాహారం, మానవ వనరుల అభివృద్ధి, ప్రభుత్వ సులభతర వ్యాపార విధానాలు, విద్య - వైద్య రంగాల్లో ఏఐ వినియోగం పై ఆయన చేసిన సూచనలను ప్రజా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.

**జయభేరి, హైదరాబాద్ :**

ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగం, దాని ఉపయోగంపైన ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని, ఈ విషయంలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ని కోరారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క, మంత్రి డి. శ్రీధర్ బాబుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రఘురామ్ రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఏఐ వినియోగంతో పాటు మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. సరైన పద్ధతిలో ఏఐని వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రాజన్ చెప్పారు. తమిళనాడు తరహాలో పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని తెలిపారు. DataCenters కోసం పెద్ద ఎత్తున విద్యుత్, నీటి వినియోగం ఉంటుందని చెప్పారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు వస్తానని ఈ సందర్భంగా తెలిపారు. నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రఘురామ్ రాజన్ వివరించారు. మానవ వనరుల ...మిగతాది 2 లో



# సీఎం పదవికి రాజీనామా చేయను

- మమతా బెనర్జీ సంచలన ప్రకటన
- 100 స్థానాల్లో ఫలితాలను దోచుకున్నారు
- భారత ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ విమర్శల దాడి

**జయభేరి, న్యూఢిల్లీ:**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజైన మంగళవారం టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, తాను వ్యక్తిగతంగా ఓడిపోలేదని ...మిగతాది 2 లో

# మోడీ సభ నుంచి ఆపరేషన్ తెలంగాణ



- మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ
- ఈ ఏడాది జరగనున్న జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యం

**జయభేరి, హైదరాబాద్, మే 5 :**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యటన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఈ సభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టింది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ...మిగతాది 2 లో

# కాంగ్రెస్ సర్కార్ రైతులకు అన్యాయం చేస్తోంది



2 లో

- కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ పోరాటం
- నాడు కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగ
- ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం దండుగ

**జయభేరి, వరంగల్ :**

బుధవారం వరంగల్ లోని హంటర్ రోడ్డు వద్ద నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సు సభా ప్రాంగణాన్ని సందర్శించిన తరువాత బీఆర్ఎస్ నేతలు రం మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. నేడు నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారు. నాడు కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగగా ఉండేది. ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం దండుగగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్డి ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ సర్కార్ రైతులకు అన్యాయం చేస్తోంది. గత రెండేళ్ల నుండి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాల వల్ల అష్టకష్టాలు పడుతున్న రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతోంది. ఎన్నికలకు ముందు ప్రజాపాలన అని అన్నారు... గద్దెనెక్కిన తర్వాత ప్రతీకార పాలన చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న రైతు సంగ్రామ సదస్సుకు పోటీగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మేళాలు ఏర్పాటు చేశారు. మా బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు అనేక అవరోధాలను, అడ్డంకులను సృష్టించారు. కనీసం అవగాహన లేకుండా ఈ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. రైతులకు మద్దతుగా సదస్సు పెడుతుంటే మా బీఆర్ఎస్ కార్యకర్తలు కట్టిన పార్టీ తోరణాలు, ఫ్లెక్సీలు కాంగ్రెస్ ప్రభుత్వం తొలగిస్తుందని అన్నారు.



# లక్షల్లో కొత్త ఇళ్లు

## ప్రభుత్వం కీలక నిర్ణయం

- రాష్టంలో ఇల్లు లేనివారికి అతి భారీ గుడ్ న్యూస్

**జయభేరి, విజయవాడ, మే 5:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సొంతంగా ఒక ఇల్లు నిర్మించుకోవాలని ఆశ పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రామీణ ప్రాంతాల్లో తలదాచుకోవడానికి గూడు లేని వారికి చేయూతనిస్తూ, కొత్త ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాల దశాబ్దాల కల నెరవేరబోతోంది. ముఖ్యంగా ఈ నెలాఖరులోగా కొత్త ఇళ్ల మంజూరు ...మిగతాది 2 లో

# జూన్ 2 లోపు కేబినెట్ విస్తరణ




**జయభేరి, హైదరాబాద్, మే 5 :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. పరిపాలనలో వేగం పెంచడం, రాబోయే సవాళ్లను ఎదుర్కోవడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు సిద్ధమవుతున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం కనిపిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం మంత్రివర్గంలో ముగ్గురు కొత్త వాళ్లకు చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇందులో ఖాళీగా ఉన్న ఒక స్థానంతో పాటు, పనితీరు సరిగా లేని ఇద్దరు మంత్రులను తప్పించి వారి స్థానాలను ...మిగతాది 2 లో

# దోపిడీ వెనుక ఆ ముఠా..

...మిగతాది 5 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సరైన పద్ధతిలో వినియోగిస్తే మేలు

అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించుకోవాలంటూ పలు సూచనలు చేశారు. ప్రభుత్వాలు అనుసరించే సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని చెప్పారు. Startups ను ఎక్కువ ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల కోసం కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కావాల్సిన భూమితో పాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డుతో పాటు అనేక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి పైన దృష్టి సారించినట్టు తెలిపారు. CURE, PURE, RARE విధానంలో ముందుకు వెళ్తున్నట్టు ఆయన వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి 24 గంటలు కష్టపడుతున్నారన్నారు. తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి కోసం తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రఘురామ్ రాజన్ ని కోరారు. సులభతర వ్యాపారానికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వివరించారు. Pharma, ఐటీ, డేటా సెంటర్ల కోసం కావాల్సిన మంచి వాతావరణం, వసతులు కల్పిస్తున్నట్లు రఘురామ్ రాజన్ కి వివరించారు. ఈ సమావేశంలో CS కె. రామకృష్ణా రావు, సీఎంతో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

## మోడీ సభ నుంచి ఆపరేషన్ తెలంగాణ

భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది. రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో దాదాపు రూ.7,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించిన ఈ భారీ కేటాయింపుల ద్వారా తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది. ఈ ఏడాది జరగనున్న జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో అసాధారణ రీతిలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మే 4న విడుదలయ్యే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ నమ్మకంగా ఉంది. ఆ గెలుపు ఉత్సాహంతో తెలంగాణలో 'ఆపరేషన్ తెలంగాణ'ను ప్రారంభించి, దక్షిణాదిలో తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది. కర్ణాటక తర్వాత దక్షిణాదిలో తెలంగాణనే తమకు అనుకూలమైన రాష్ట్రంగా బీజేపీ మొదటి నుంచీ చెబుతోంది. అయితే, రాష్ట్ర పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కొంతకాలంగా ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. వర్గపోరుకు చెక్ పెట్టి, పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రధాని మోదీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి, కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునివ్వనున్నారు. మొత్తానికి మే 10న జరిగే ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందా? 'ఆపరేషన్ తెలంగాణ' ద్వారా బీజేపీ తన సత్తా చాటుతుందా? అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణను కైవసం చేసుకునేందుకు కమలనాథులు వేస్తున్న స్కెచ్ ఏ మేరకు ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి.

## జూన్ 2 లోపు కేబినెట్ విస్తరణ

భర్తీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. ముఖ్యంగా ప్రజలతో నేరుగా సంబంధం ఉండే కీలక శాఖల మంత్రుల పనితీరుపై ఇప్పటికే హైకమాండ్ నివేదికలు తెప్పించుకుంది. కొన్ని ప్రతిష్ఠాత్మక హామీల అమలులో వెనుకబడిన శాఖల బాధ్యతలను సమర్థులకు అప్పగించేలా భారీ మార్పులు జరగనున్నాయి. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అంశం మరోసారి చర్చకు వచ్చింది. తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హైకమాండ్ హామీ ఇచ్చిందని ఆయన పదేపదే చెప్తున్నారు. అయితే, ఉమ్మడి నల్గొండ జిల్లా నుండి ఇప్పటికే తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రులుగా ఉన్నారు. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఈసారి కేబినెట్ లో చోటు దక్కుతుందా లేదా అనేది ఆసక్తిగా మారింది. అయితే కోమటిరెడ్డి సోదరుల్లో ఒకరికే అవకాశం అనే నిబంధనను అధిష్ఠానం తెరపైకి తెచ్చినట్టు సమాచారం. ఒకవేళ రాజగోపాల్ రెడ్డికి చోటు కల్పించాల్సి వస్తే, వెంకట్ రెడ్డిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. పైగా సీఎం రేవంత్ రెడ్డితో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి గ్యాప్ వచ్చినట్లు సమాచారం. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండటంతో న్యాయని తెలియగానే పలువురు సీనియర్లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్టీ కోటాలో మహబూబాబాద్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, బాలు నాయక్ మధ్య పోటీ నెలకొంది. బీసీ కోటాలో మున్నూరు కాపు వర్గం నుండి ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. ఇక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కూడా మంత్రివర్గంలో చోటుకోసం ప్రయత్నిస్తున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సైతం కేబినెట్ లోకి వెళ్లాలని ఆశిస్తున్నట్టు సమాచారం. కేవలం కేబినెట్ మాత్రమే కాకుండా, టీపీసీసీలో ఖాళీగా ఉన్న కార్యనిర్వాహక అధ్యక్షుల నియామకంపై కూడా కసరత్తు జరుగుతోంది. ఎస్సీ మాదిగ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ లంబాడ వర్గం నుంచి బలరాం నాయక్ లేదా బెల్లయ్య నాయక్ ను కార్యవర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి నాయిని రాజేందర్ రెడ్డి లేదా చామల కిరణ్ కుమార్ రెడ్డికి చోటు దక్కవచ్చు. మైనార్టీల నుంచి అజ్మతుల్లా, ఫహీమ్ ఖురేషీ స్థానం ఆశిస్తున్నారు. వీళ్లతో పాటు ప్రచార కమిటీ ఛైర్మన్ గా మధుయాష్కీని కొనసాగించాలా లేదా అన్నది, కోశాధికారిగా రోహిన్ రెడ్డి నియామకం వంటి అంశాలపై త్వరలోనే స్పష్టత రానుంది. మొత్తానికి జూన్ 2 లోపు జరగబోయే ఈ మార్పులు అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కొత్త జోష్ నింపుతాయా లేక అసంతృప్తులకు దారితీస్తాయా అన్నది వేచి చూడాలి.

## కాంగ్రెస్ రైతులకు అన్యాయం చేస్తోంది

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం బీఆర్ఎస్ పోరాడింది. నాడు కేసీఆర్ ప్రభుత్వం రాకముందు తెలంగాణలో కేవలం 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే పండేది. కేసీఆర్ నాయకత్వంలో రైతుల కోసం తెచ్చిన అద్భుతమైన పథకాల వలన నేడు 3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతోంది. కేసీఆర్ రైతులను రాజు చేయాలని చూశారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. పంటలు కొనుగోళ్లను సైతం సరిగ్గా చేయకుండా అన్నదాతలను ఆవేదనకు గురి చేస్తుంది. కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతులు పడుతున్న గోసను తెలంగాణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. రైతు రుణమాఫీకి రూ. 36 వేల కోట్లు అవసరం అయితే.. కేవలం రూ. 18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి ఈ కాంగ్రెస్ సన్నాసులు చేతులు దులుపుకున్నారు. కేసీఆర్ రైతుబంధును పది నెలల ముందు క్రమం తప్పకుండా ఇచ్చేవారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతీగతీ లేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం మొక్కజొన్న పంట కొనుగోళ్లు చేపట్టడం లేదు. కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే మార్కెట్ కు రండి.. ఇక్కడ పంటలు కొనుగోళ్లు జరగట్లేదు. దమ్ము, సిగ్గు ఉంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కొనుగోలు సెంటర్ లకు వెళ్ళాలి. రైతు సమ్మేళనాలు కాదు రైతు సంక్షేమానికి పాటుపడండని అన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మళ్లోసారి ప్రజలకు గుర్తు చేసేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నాం. కేసీఆర్ రైతు బంధు పథకాన్ని ఆదర్శంగా తీసుకొని మోదీ కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలు చేస్తున్నారు. కేసీఆర్ అమలు చేసిన ఎన్నో పథకాలను కాపీ కొడుతూ కేంద్రం ఇప్పటికే చాలా పథకాలు అమలు చేస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు.

# ఎల్ నినో సూపర్ ఎల్ నినోగా ఎందుకు మారుతోందా...



ఈసారి ప్రకృతి తన వికృత రూపాన్ని ప్రదర్శించబోతోంది. 2026లో దేశం నిప్పుల కొలిమిలా మారుతోంది. రాబోయే రోజుల్లో ఆహార కొరత సామాన్యుడిని వేధించబోతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సూపర్ ఎల్ నినో కేవలం వాతావరణ మార్పు మాత్రమే కాదని దేశ ఆర్థిక వ్యవస్థను, సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేయగల శక్తి ఉంది. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే ఒక అసాధారణ వాతావరణ పరిస్థితి. సాధారణంగా పసిఫిక్ మహాసముద్రం తూర్పు, మధ్య భాగాలలో నీటి ఉష్ణోగ్రతలు పెరగడాన్ని ఎల్ నినో అని పిలుస్తారు. సాధారణ పరిస్థితుల్లో భూమధ్యరేఖ వెంబడి వీచే ట్రేడ్ విండ్స్ వేడి నీటిని ఆసియా వైపు నెట్టివేస్తాయి. కానీ ఎల్ నినో సమయంలో ఈ పవనాలు బలహీనపడతాయి. దీని వల్ల వేడి నీరు దక్షిణ అమెరికా తీరం వైపు వెళ్తుంది. ఈ మార్పుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఫలితంగా ఒక చోట అతివృష్టి మరో చోట తీవ్రమైన కరువు ఏర్పడుతుంది. వాతావరణ నిపుణుల అంచనా ప్రకారం, 2026లో ఏర్పడబోయే ఎల్ నినో గత 140 ఏళ్లలో అత్యంత శక్తివంతమైనదిగా ఉండబోతోంది. యూరోప్‌కు చెందిన అధునాతన వాతావరణ నమూనాలు దీనిని మెగా ఎల్ నినో గా అభివర్ణిస్తున్నారు. సముద్ర మట్టం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా పెరగడం వల్ల దీని ప్రభావం కూడా అంతే తీవ్రంగా ఉండబోతోంది. ఇది 1877 నాటి భయంకరమైన కరువు పరిస్థితులను గుర్తుకు తెచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. భారత్ దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. దేశంలోని దాదాపు 51 శాతం వ్యవసాయ పనులు వర్షంపై ఆధారపడి ఉన్నాయి. సూపర్ ఎల్ నినో ప్రభావంతో 2026లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. వర్షాలు సరిగా లేకుంటే పంట దిగుబడి తగ్గి, రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తూర్పు, వాయవ్య, దక్షిణ భారత్‌లో సాధారణం కంటే ఎక్కువ వడగాల్పులు వీయవచ్చు. కేవలం పగటిపూట మాత్రమ కాదు, రాత్రి ఉష్ణోగ్రతలు కూడా అధికంగా ఉండటం వల్ల మానవ శరీరం చల్లబడే అవకాశం దొరకదు. ఇది ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. పంట ఉత్పత్తి తగ్గడం వల్ల ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. సాధారణ ఎల్ నినో సమయాల్లోనే ఆహార ధరలు 5 శాతం వరకు పెరుగుతాయి. సూపర్ ఎల్ నినో వస్తే మాత్రం ఈ పెరుగుదల మరింత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపుతుంది. చెట్లు స్థానిక ఉష్ణోగ్రతను 12 డిగ్రీల వరకు తగ్గించగలవు. కాబట్టి ఉన్న చెట్లను కాపాడుకోవడంతో పాటు కొత్త మొక్కలు నాటడం మంచిది. : ఎండ వేడికి ప్రజలు అబ్బా అంటున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడి భగభగలు. బయటకు వెళితే చమటలు పట్టిస్తున్న వేడి సెగలు .ఇంట్లో ఉంటే ఉక్కపోత సెగలు. ఇదీ వేసవి పరిస్థితి. మధ్యాహ్నం తర్వాత పరిస్థితి మరింత దారుణం. బయటకు వెళితే క్షేమంగా తిరిగి వస్తామా అన్నట్లు ఉంది పరిస్థితి. కొందరు వేడి కారణంగా అనారోగ్యానికి గురవుతుండగా మరికొందరు వడదెబ్బతో ప్రాణాలు కోల్పోతున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే డజన్ల కొద్దీ వడదెబ్బ మరణాలు సంభవించాయన్న వాస్తవం. ఈ సంక్షోభ తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటిన నేపథ్యంలో మే నెలలో వడదెబ్బ ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రాకపోవడం ఉత్తమం. తగినంత నీరు తాగడం, ఓఆర్ఎస్ వాడటం ద్వారా డీహైడ్రేషన్ నుంచి తప్పించుకోవచ్చు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, అడవుల సంరక్షణ ద్వారా దీర్ఘకాలికంగా ఇటువంటి వాతావరణ మార్పులను అడ్డుకోవచ్చు. వేసవి వచ్చిన ప్రతిసారి కలవరపెట్టే అంశం వడదెబ్బ. వడదెబ్బ బారిన పడి ప్రతిసారి అనేక మంది ప్రాణాలు కోల్పోతూ ఉండగా తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా ఈసారి కూడా మరణాలు నమోదయ్యాయి. తెలంగాణలో ఏప్రిల్ 25న ఒక్క రోజే ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ వేసవిలో దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు సంభవించిన వడదెబ్బ మరణాల గురించి కచ్చితమైన సమాచారం లేకున్నా వివిధ రాష్ట్రాల్లో రోజూ పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిసింది. ఇందులో ఎక్కువగా పొలం పనులు చేసేవారు, పని మీద బయటకు వెళ్లిన వారే ఉంటున్నారు. ఏప్రిల్‌లో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మే మాసంలో ఎండలు మరింత విరుచుకపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మరో నెల రోజుల్లో వడదెబ్బ మరణాలు పెరగవచ్చనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

## సీఎం పదవికి రాజీనామా చేయను

ఆమె స్పష్టం చేశారు. ఈ పరాజయం ప్రజలు ఇచ్చిన తీర్పు కాదని, ఇది వ్యవస్థల ద్వారా ప్రభావితమైన ఫలితమని ఆరోపిస్తూ, తాను సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఆమె తెగేసి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమిని విశ్లేషిస్తూ, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి తమ పార్టీ 'నైతికంగా' విజయం సాధించిందని పేర్కొన్నారు. ఫలితాలు తమకు వ్యతిరేకంగా వచ్చేలా పక్కా ప్రణాళికతో కుట్ర జరిగిందని ఆమె విమర్శించారు. "నేను ఓడిపోలేదు, మా పార్టీ కూడా ఎన్నికల్లో ఓడిపోలేదు. ఇది కేవలం బీజేపీ బలవంతపు ప్రయత్నం వల్ల వచ్చిన ఫలితం. నైతిక విలువలు, ప్రజా మద్దతు పరంగా చూస్తే, ఈ ఎన్నికల్లో మేమే విజేతలం," అని ఆమె తన ధీమాను వ్యక్తం చేశారు. సుమారు 100 స్థానాల్లో ఫలితాలను "దోచుకున్నారని" ఆరోపిస్తూ, తమ పార్టీ మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఓట్ల లెక్కింపును కావాలనే ఆలస్యం చేశారని, ప్రక్రియలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయని అన్నారు. "నిన్నటి సంఘటన చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా నిలుస్తుంది" అని పేర్కొంటూ ఎన్నికల సంఘం వైఖరిని తీవ్రంగా ఖండించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించిన ఆమె, ఈ విషయంపై తగిన చర్యలు తీసుకునే దిశగా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఎన్నికల అనంతర హింస ప్రభావిత ప్రాంతాల పరిస్థితిని పరిశీలించేందుకు 10 మంది సభ్యులతో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నాయకులకు మమతా బెనర్జీ కృతజ్ఞతలు తెలిపారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, హేమంత్ సోరెన్, తేజస్వి యాదవ్ వంటి కీలక నేతలు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని వెల్లడించారు. సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ బుధవారం తనను కలవడానికి వస్తున్నారని చెబుతూ, తన భవిష్యత్తు కార్యాచరణను స్పష్టం చేశారు. "నేను ఇప్పుడు ఒక స్వేచ్ఛా పక్షిని. ఇతర ఇండియా బ్లాక్ నాయకులతో కలిసి భవిష్యత్తులో ఏం చేయబోతున్నాననే దానిపై నాకు పూర్తి స్పష్టత ఉంది," అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యంగా భారత ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ విమర్శల దాడిని ఎక్కుపెట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడానికి ఒక 'విలన్'లా వ్యవహరించారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈవీఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఓటింగ్ ముగిసిన తర్వాత కూడా మిషన్లలో 80, 90 శాతం ఛార్జింగ్ ఎలా ఉంటుందని ఆమె ప్రశ్నించారు. ఇది సాంకేతికంగా సాధ్యం కాదని, ఇందులో ఏదో మాయాజాలం జరిగిందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణ తీరుపై మమతా బెనర్జీ మరిన్ని ఘాటు విమర్శలు చేశారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందే తమ పార్టీ నేతలను అరెస్టు చేయడం, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను యథేచ్ఛగా బదిలీ చేయడం వంటి చర్యలు బీజేపీకి అనుకూలంగా జరిగాయని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘం పూర్తిగా బీజేపీ కనుసన్నల్లో పనిచేసిందని, ఇది బీజేపీకి మరియు ఎన్నికల సంఘానికి మధ్య జరిగిన పందెంలా అనిపించిందని విమర్శించారు. ఇందులో ప్రధానమంత్రి కార్యాలయం మరియు హోం మంత్రిత్వ శాఖ నేరుగా జోక్యం చేసుకున్నాయని, ఓటర్ల జాబితా నుండి సుమారు 90 లక్షల పేర్లను తొలగించడం ద్వారా తమ గెలుపును అడ్డుకున్నారని ఆమె మండిపడ్డారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో జరిగిన పరిణామాలను వివరిస్తూ మమతా బెనర్జీ భావోద్వేగానికి లోనయ్యారు. తాను ఒక నియోజకవర్గంలో 13,000 ఓట్ల ఆధిక్యంలో ఉన్న సమయంలో బీజేపీ శ్రేణులు కౌంటింగ్ కేంద్రాన్ని హైజాక్ చేశాయని ఆరోపించారు. ఒక అభ్యర్థిగా తాను అక్కడే కూర్చున్నప్పటికీ, తనను బలవంతంగా బయటకు నెట్టేశారని, ఆ క్రమంలో తనపై భౌతిక దాడి కూడా జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి నీచమైన, దుర్మార్గమైన ఎన్నికలను ఎప్పుడూ చూడలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఓటమిని జీర్ణించుకుని మళ్లీ పుంజుకుంటామని మమతా బెనర్జీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో జరిగిన అక్రమాలు మరియు హింసాత్మక ఘటనలను పరిశీలించడానికి ఐదుగురు ఎంపీలతో కూడిన ఒక 'వాస్తవ పరిశీలన కమిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీ ప్రభావిత ప్రాంతాలను సందర్శించి సమగ్ర నివేదిక ఇస్తుందని చెప్పారు. తాము బీజేపీతో కాకుండా, వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ఆడిన ఒక కుయుక్తితో కూడిన ఆటతో పోరాడామని ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

## తమిళనాడు ప్రజలే నా బలం

రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాటి నుండి ఎదురైన అవమానాలు, విమర్శలను గుర్తుచేసుకుంటూనే, తనకు అండగా నిలిచిన తమిళ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విజయ్ తన ప్రసంగంలో రాజకీయ ప్రయాణంలోని కష్టాలను ప్రస్తావిస్తూ.. పార్టీని ప్రారంభించిన సమయం నుండి తమను తక్కువ చేసి మాట్లాడిన వారే ఎక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఇలాంటి విమర్శలు సహజమేనని, అయితే వాటన్నింటినీ అధిగమించి తాము ఇక్కడి వరకు వచ్చామని ఆయన పేర్కొన్నారు. ఎవరి మద్దతు కోసం ప్రాకులాడకుండా, కేవలం ప్రజలను మాత్రమే నమ్ముకుని, ఎన్నికల రణక్షేత్రంలో ధైర్యంగా నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. ఒక నటుడిగా రాజకీయాల్లోకి రావడం వల్ల ఎదురైన సవాళ్లను విజయ్ వివరించారు. తాను కేవలం ఒక నటుడినని, ముఖానికి ముసుగు వేసుకుని వస్తున్నానని కొందరు విమర్శించారని, అనేక అవమానాలను ప్రసాదించారని గుర్తుచేసుకున్నారు. అయితే, అవేవీ తన సంకల్పాన్ని దెబ్బతీయలేకపోయాయని ఆయన అన్నారు. తనకు దక్కిన ఈ గౌరవానికి, విజయానికి ప్రధాన కారణం తమిళనాడు ప్రజలేనని, వారు తనను ఒక తల్లిలా అక్కున చేర్చుకుని నడిపించారని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు.

ఈ ఎన్నికల ఫలితాలు భారతీయ రాజకీయాల్లోనే ఒక ఆశ్చర్యకరమైన మలుపు అని విజయ్ అభివర్ణించారు. ప్రజలు తనపై చూపిన అంతులేని ప్రేమ, ఇచ్చిన అమోఘమైన తీర్పు రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేసిందని ఆయన అన్నారు. మనీ పవర్ (డబ్బు ప్రభావం) పెరిగిపోయిన ప్రస్తుత కాలంలో, ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తులు సైతం ప్రజాస్వామ్య బలాన్ని నిరూపించడం ఈ ఎన్నికల ప్రత్యేకత అని ఆయన విశ్లేషించారు. రాష్ట్రంలో ఒక గొప్ప మార్పు కోసం జరిగిన ఈ పోరాటంలో గెలిచింది కేవలం 'తమిళనాడు విజయ సంఘం' మాత్రమే కాదని, ఇది తమిళ ప్రజల మనసుల్లో ఉన్న ప్రగాఢమైన కోరికకు లభించిన విజయమని విజయ్ పేర్కొన్నారు. డబ్బు రాజకీయాలకు భయపడకుండా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం వల్ల ప్రజాస్వామ్యం గెలిచిందని, దీనివల్ల బెదిరింపులకు పాల్పడే శక్తులకు గట్టి గుణపాఠం లభించిందని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడులో మార్పు కోసం ఆవిర్భవించిన ప్రధాన శక్తి టీవీకే అని ఈ ఎన్నికలు నిరూపించాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీ నిజాయితీతో కూడిన రాజకీయాలను ప్రజలు అంగీకరించడం శుభపరిణామమని, ఇది భవిష్యత్తులో మరింత లోతైన మార్పులకు నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయాన్ని ఒక బాధ్యతగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. తన విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికీ విజయ్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తనను నమ్మి ఓటు వేసిన ప్రజలతో పాటు, అహర్నిశలు శ్రమించిన పార్టీ సహచరులు, వివిధ స్థాయిల నిర్వాహకులు మరియు సోషల్ మీడియాలో తమ గళాన్ని వినిపించిన 'వర్చువల్ వారియర్స్' (డిజిటల్ సైనికులు) అందరికీ తన జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన ప్రకటించారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల కోసం నిరంతరం పోరాడుతానని విజయ్ హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో తమకు ఓటు వేసిన వారే కాకుండా, భవిష్యత్తులో తమ సిద్ధాంతాలను ప్రేమించి మద్దతు ఇచ్చే ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగుతానని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. తమిళనాడు ప్రగతి కోసం తమ రాజకీయ ప్రయాణం ఇప్పుడే మొదలైందని ఆయన స్పష్టం చేశారు.

## లక్షల్లో కొత్త ఇళ్లు

పత్రాలను అందజేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'పీఎం ఆవాస్ యోజన' పథకం కింద రాష్ట్రానికి భారీగా ఇళ్లు కేటాయించింది. ఇందులో భాగంగా మొదటి విడతలో లక్ష ఇళ్లను మంజూరు చేయడానికి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. వన్ ఇండియా వెల్లడించిన కథనం ప్రకారం.. మే నెలాఖరు నాటికి లబ్ధిదారుల తుది జాబితాను విడుదల చేసి, జూన్ నెల నుంచే ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుందట. దీనివల్ల వర్షాకాలం నాటికే పనులు మొదలై, త్వరితగతిన ఇళ్లు పూర్తి కావడానికి అవకాశం ఉంటుంది. ఈ పథకం కోసం దరఖాస్తుల ప్రక్రియను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించింది. గత ఏడాది డిసెంబర్ వరకు నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి 7 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతనిస్తూ, తొలి విడతలో లక్ష మందికి ఇళ్లను కేటాయిస్తున్నారు. మిగిలిన వారికి తదుపరి విడతల్లో ప్రాధాన్యత లభించనుంది. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అందించే ఆర్థిక సాయం విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. నివాస స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ. 2.39 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 72,000 ఇస్తుండగా, స్వచ్ఛ భారత్ మరుగుదొడ్ల పథకం కింద మరో రూ. 39,000 అందజేస్తుంది. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా రూ. 1,28,000 ఆర్థిక సాయం అందజేస్తుంది. అవినీతికి తావులేకుండా ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేర్చేందుకు ప్రభుత్వం 'స్పర్శ్' (SPARSH) విధానాన్ని అమలు చేస్తోంది. ఈ డిజిటల్ పద్ధతి ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నిర్మాణ దశల వారీగా డబ్బులు నేరుగా లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయి. దీనివల్ల పేదలు ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తమ ఇంటిని తామే నిర్మించుకునే వెసులుబాటు కలుగుతుంది. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తుల స్వీకరణ జరిగినప్పటికీ, జాబితా తయారీలో జాప్యం జరిగిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేర్కొంది. తాము అధికారంలోకి వచ్చాక దరఖాస్తులను తిరిగి పరిశీలించి, ప్రక్రియను వేగవంతం చేశామని అధికారులు వెల్లడించారు. ఈ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, నిరాశ్రయులకు ఒక భరోసా లభించినట్లయింది. సొంత గూడు లేని వారి జీవితాల్లో ఈ పథకం కొత్త వెలుగులు నింపనుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు

జయభేరి, శామీర్ పేట్, మే 5:




అలియాబాద్ లోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్ , అలియాబాద్, మూడు చింతల పల్లి మున్సిపల్ చైర్మన్ లు కంఠం శిరీష కృష్ణారెడ్డి, జాం రవి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పంట మార్పిడి, ఉద్యాన పంటల సాగు విస్తరణ, సూక్ష్మ సేద్యం, సమీకృత వ్యవసాయ విధానాలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిదంగా డ్రిప్, స్పింకర్ల పరికరాల పై ప్రభుత్వం అందిస్తున్న 90 శాతం సబ్సిడీ, పాలి హౌస్, షేడ్ నెట్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు వివరించారు. అనంతరం జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంప్రదాయ పంటలతో పాటు కూరగాయలు, పండ్ల తోటల పెంపకం , పూల సాగు, ఔషధ మొక్కల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని సూచించారు. ఇక వర్షాధార ప్రాంతాల్లో సూక్ష్మ సేద్యం తప్పనిసరి అని, ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ శైలజ, జె డి ఎచ్ సంగీత లక్ష్మిలు మాట్లాడుతూ తేనెటీగల పెంపకం, వాటి ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్లు కంఠం శిరీష కృష్ణారెడ్డి, జాం రవి లు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని, తద్వారా అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అనంతరం రైతులకు ఉద్యాన పథకాల కరపత్రాలు, సబ్సిడీ వివరాలను అందచేసి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.మురళీ, డి ఏ ఓ చంద్రకళ, ఉద్యాన శాఖ అధికారులు వెంకట రమణ, స్వప్నిక, సాగరిక, సంధ్య, శామీర్ పేట ఏ ఓ రమేష్, ఏ ఈ ఓ లు రవి, సుధీర్, కౌన్సిలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# భారీగా హుండీ ఆదాయం రూ.2.48 కోట్లు



- యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ వెల్లడి

జయభేరి, యాదగిరిగుట్ట, మే 05 :

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి భారీగా హుండీ ఆదాయం వచ్చినట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. మంగళవారం జరిగిన 36 రోజుల హుండీ ఆదాయం లెక్కింపులో 2,48,53,666 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. నగదుతో పాటు 64 గ్రాముల బంగారం,3 కిలోల వెండిని భక్తులు హుండీలో సమర్పించుకున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ వెల్లడించారు. అమెరికా 312 డాలర్లు, ఇంగ్లాండ్ 55 పాండ్స్, కెనడా 940 డాలర్లు, నేపాల్ 55, ఆస్ట్రేలియా 40, ఖతార్ 2 రియాల్, మలేషియా 28,సింగపూర్ 9, సౌదీ అరేబియా 225, ఒమన్ 10,400 బైసా, కెన్యా 100,స్వీడన్ 20, మొజాంబిక్ 50,000 హుండీలో సమర్పించుకున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు.

# సిపిఐ, సిపిఎం మిత్రులకు నామినేటెడ్ పదవులు

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సంచలన ప్రకటన
- వచ్చే నెల నుంచి కొత్త పెన్షన్లు
- ధాన్యం కొనుగోళ్ల కు రెండు మూడు రోజుల్లోనే చెల్లింపులు

జయభేరి, యాదగిరిగుట్ట, మే 05 :



కాంగ్రెస్ జెండాను మోసిన పార్టీ శ్రేణుల తో పాటు సిపిఐ, సిపిఎం మిత్రపక్షాలకు కూడా త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవులను ఇస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సంచలన ప్రకటన చేశారు. మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గంలోని తనకు మొదటి నుంచి మిత్ర పక్షాలు సంపూర్ణ సహకారం ఇస్తున్నాయని అన్నారు. వచ్చే నెలలో అర్హులకు కొత్తగా పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.
బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు రాబోయే ఎన్నికల్లో వారి పార్టీ అభ్యర్థిత్వాల కోసం బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కల్లూరి రామచంద్రా రెడ్డి పోటీ కోసం తహతహలాడుతున్నారని ఆయనతో పాటు పదిమంది పోటీకి వచ్చినా సింగిల్ గానే ఎదుర్కొంటానని బీర్ల అయిలయ్య అన్నారు. తనకు ఆలేరు ప్రజలు 50 వేల మెజారిటీ ఇచ్చి ఆశీర్వదించారని,స్వార్థ రాజకీయాల కోసం తనపై విపక్షాలు చల్లే బురద తనకు పూల జల్లుగా భావిస్తానన్నారు.
ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని,ఆకాంక్షల ను దృష్టిలో పెట్టుకొని నిరంతరం అభివృద్ధి, సంక్షేమం కోసం కష్టపడుతున్నానని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు.

**ప్రతి గింజను కొంటాం**

ములకలపల్లిలో ఏప్రిల్ 28వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించామని, 29న బార్ దాన్ వచ్చిందని, ఆ మరుసటి రోజే బిఆర్ఎస్ ధర్నాకు దిగిందని బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజలు, రైతులు వారి చేష్టలను గమనిస్తున్నారు. వారి కాలంలో రైతులకు నెలలు తరబడి చెల్లించేవారు కాదని తమ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన రెండు మూడు రోజుల్లోనే రైతులకు డబ్బులు ఇస్తున్నామని అన్నారు. గంధమల్ల ప్రాజెక్ట్ ద్వారా వంద చెరువులు నింపామన్నారు.



# తమిళనాడు కాబోయే ముఖ్యమంత్రికి అభినందనలు

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ విజయ్ కుమార్ (రిపోర్టర్) తమిళనాడులో భారీ మెజార్టీతో గెలుపొందిన విజయ్ కు కలిసి అభినందనలు తెలియజేసిన విజయ్ కుమార్.

# కమిషనర్ ను కలిసిన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్



జయభేరి, శామీర్ పేట్, మే 5:

అలియాబాద్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. వెంకట్ రెడ్డిని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై చర్చించారు . మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని నూతన కమిషనర్ ను ఆయన కోరారు. ఈ సందర్భంగా తుంకి రమేష్ మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కమిషనర్ నాయకత్వంలో మున్సిపాలిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగం పెంచాలి

జయభేరి, యాదగిరిగుట్ట, మే 05 :



ధాన్యం కొనుగోలు వేగం పెంచాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని జంగంపల్లి, దాతారుపల్లి ఐకెపి కేంద్రాలు, యాదగిరిగుట్ట పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ మాట్లాడుతూ మిల్లర్లు ఏ గ్రేడ్ ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత మిల్లుకు వెళ్లాక బి గ్రేడ్‌గా ట్రేడ్ చేసి లక్షలాది రూపాయలు రైతాంగం నుండి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ దోపిడీని అరికట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జోక్యం చేసుకొని రైతులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు నూకల భాస్కర్ రెడ్డి, నేతలు మొహియుద్దీన్, ధీరావత్ మంగునాయక్, ధీరావత్ ధనరాజ్, బాలు నాయక్, గుండ్ల మల్లారెడ్డి, దూసరి కల్పన, తెల్జీరి నరసింహ, కవిత, దీరావత్ విమల, సునీతా, జహంగీర్, దూసరి వెంకటయ్య, కర్రె భాగ్యలక్ష్మి, పాపమ్మ, కర్రె ఐలయ్య, కంబాలపల్లి పద్మ, బత్తిరి వెంకటయ్య, అమ్రా నాయక్, బొల్లారం లింగం, బత్తిని ఆంజనేయులు, యేషబోయిన నరసింహ, ముక్కర్ల సత్యనారాయణ, పసుల నరసింహ, ఎడపెల్లి కమలమ్మ, మేకల సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మహబూబ్ నగర్ లో బిజెపి సమావేశం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 1 గంటలకు పార్టీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 10న తెలంగాణకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్న సందర్భంగా పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే జన ఆగ్రహ సభ గురించి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కావున ఈ సమావేశానికి అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చా నాయకులు, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు అందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని కొండ ప్రశాంత్ రెడ్డి కోరారు.

# తీరనున్న తాగునీటి కష్టాలు

- 20 వ వార్డులో బోర్ ఫ్లషింగ్ పనులు ప్రారంభించిన - మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి



జయభేరి, శామీర్ పేట్, మే 5:

వేసవి కాలంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రజా ప్రతినిధులు తీసుకుంటున్న చర్యలతో ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. ఇందులో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 20 వ వార్డులో గత కొంత కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు పరిష్కారం లభించింది. వార్డులో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కోసం బోర్ వెల్ ఫ్లషింగ్ పనులు చేపట్టడంతో పాటు కొత్త మోటారు బిగించడంతో నీటి సరఫరా పునరుద్ధరించారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ మౌనిక దినేష్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టగా ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి హాజరై నూతన మోటారును ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గాను కొత్త మోటార్లు బిగించి నీటి సరఫరా మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 20వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని బోర్ మోటారు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయ్ కుమార్, విద్యాసాగర్, శ్రీనివాస్, రమేష్, శేఖర్, రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మే 10 పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాని మోదీ భారీ సభను విజయవంతం చేద్దాం

జయభేరి, షాద్ నగర్, మే 05 :



ఖాటేదాన్ డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మోదీజీ సభ ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఐటీ సెల్ కన్వీనర్ వెంకట్ రమణ హాజరయ్యారు.
ఈ సందర్భంగా శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 10న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు. అలాగే సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మోదీజీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాలు, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ప్రజల్లో బీజేపీపై విశ్వాసం మరింత పెరుగుతోందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. మోదీజీ సభకు ప్రజలు, యువత, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.




## గల్లంతయిన వ్యక్తి వెలికితీత గురించి సీఐను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

జయభేరి, పరవాడ:

పరవాడ మండలం పి బోనంగి గ్రామానికి చెందిన కొవ్వూరి గోవిందరావు (19) మండల పరిధిలోని తిక్కవానిపాలెం బీచ్ లో ప్రమాదవశాత్తు మునిగి గల్లంతయ్యారు. అయితే ఇప్పటికీ మృతదేహం లభ్యం కాకపోవడంతో దీనిపై పూర్తి సమాచారాన్ని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సీఐ మల్లికార్జునరావును అడిగి తెలుసుకున్నారు. గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని మృతదేహాన్ని తొందరగా వెలికి తీయడానికి ప్రయత్నాలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## పరవాడలో హనుమాన్ జయంతి వేడుకలకు భారీ సన్నాహాలు



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో ఈనెల 12 మంగళవారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని సబ్ స్టేషన్ కూడలి, సినిమా హాల్ జంక్షన్ లో కొలువై ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయలలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు జరుపబడునని ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం ఆలయం వద్ద దాతల సహాయ సహకారాలతో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. భక్తులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని అభయ ఆంజనేయస్వామి జయంతి వేడుకలలో పాల్గొవాలని తెలియజేసారు.

## బీచ్ లో గల్లంతయ్యిన వ్యక్తికే గాలింపు చర్యలు చేపట్టిన పోలీస్ శాఖ



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం తిక్కవానిపాలెం బీచ్ వద్ద సోమవారం సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో కనిపించకుండా పోయిన బాలుడి కోసం గాలింపు చర్యలు తీవ్రంగా కొనసాగుతున్నాయని పరవాడ సీఐ ఆర్ మల్లికార్జున రావు తెలిపారు. ఈ నేపథ్యంలో బీచ్ వెంట డ్రోన్ సహాయంతో గాలింపు నిర్వహిస్తున్నారు. అదనంగా సముద్రంలో ఒక పడవను వినియోగిస్తూ శోధన కొనసాగిస్తున్నారు. నీటి ప్రవాహం మరియు అలల దిశ అప్పికొండ వైపు ఉండటంతో ఆ ప్రాంతంలో కూడా ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే బీచ్ తీరప్రాంతాన్ని బైక్‌లపై సిబ్బంది పర్యవేక్షిస్తూ అన్ని సాధ్యమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.సమీప ప్రాంతాల పోలీస్ స్టేషన్లను అలర్ట్ చేయడమేకాకుండా, మెరైన్ పోలీసులు మరియు కోస్ట్ గార్డ్ సిబ్బందికి కూడా సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయడం జరిగిందని సీఐ తెలిపారు.

## జన్మదినం, పెళ్లిరోజున ఎమ్మెల్యేకు మర్యాదపూర్వక సన్మానం

- రాష్ట్ర దళిత జర్నలిస్ట్ యూనియన్ నాయకులు పంతం విజయేందర్



జయభేరి, దంతాలపల్లి, మే 05 :

మండలం రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు జాటోత్ రామచంద్రు నాయక్ ఆయన పుట్టినరోజు మరియు పెళ్లిరోజు సందర్భంగా, మరిపెడ బంగ్లా గెస్ట్ హౌస్ లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన, దళిత జర్నలిస్టు యూనియన్,రాష్ట్ర నాయకులు పంతం విజయేందర్ ఆయనను కలుసుకొని మర్యాదపూర్వకంగా కలుసుకొని, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కృషి నిరంతరం కృషి చేస్తున్న చేస్తున్న మన ఎమ్మెల్యే భవిష్యత్తులో కూడా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు వెంకన్న శ్రీను, సి హెచ్ రమేష్ సురేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులగోస రేవంత్ రెడ్డికి తగులుతుంది

- చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే
- గూడెప్పాడ్ క్రాస్ వద్ద రైతులతో కలసి ధర్నా




జయభేరి, పరకాల, మే 05:

రైతులను కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గోస తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం గూడెప్పాడు మార్కెట్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజులు గడిచిన కాంటాలు పెట్టడంలేదని, ఏది చేయాలన్న డబ్బులు అడుగుతున్నారని, కనీసం తాగడానికి నీళ్లు కూడా మార్కెట్ లో లేవని, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కాంటాలు పెడుతున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యేకి తెలుపుతూ కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం గూడెప్పాడ్ క్రాస్ వద్ద రైతులతో, పార్టీ శ్రేణులతో కలిసి మక్కలు కొనిచేయాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. మక్కలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వకుండా, కాంటాలైన బస్తాలు తరలించకుండా కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మక్కల కొనుగోలులో అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నట్టు తెలిపారు. రాహుల్‌గాంధీ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభ నిర్వహించి ఈ నెల 6నాటికి నాలుగేండ్లు పూర్తవుతున్నా ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీ కాలేదని, రైతు భరోసాను ఎగ్గొట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా మక్కలు కొనడం లేదని, దీంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెల 6న హనుమకొండలో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని చల్లా ధర్మారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ఏకగ్రీవం ఎన్నిక

- ఇద్దరు కాంగ్రెస్, ఒకరు సీపీఐ, ఒకరు సీపీఎం సభ్యుల ఎన్నిక



జయభేరి, యాదగిరిగుట్ట, మే 05 :

యాదగిరిగుట్ట మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో నాలుగు కోఆప్షన్‌లో రెండు మైనార్టీ, రెండు జనరల్ కేటగిరీకి నోటిఫికేషన్ జారీ చేయగా నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ నుంచి గౌళికౌర్ అరుణరాజేష్,ఎండీ రహిమ సలాం, సీపీఐ నుంచి బండి జంగమ్మ,సీపీఎం నుంచి షేక్ ఉస్మాన్ షరీఫ్ నామినేషన్ దాఖలు చేశారు. యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.
ఈ సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట ఇంచార్జి కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం,తాగునీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ,మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆలేరు ఎమ్మెల్యే వారికి సూచించారు.
యాదగిరిగుట్ట మున్సిపల్ పాలకవర్గం, కోఆప్షన్ సభ్యులు సమన్వయంతో పని చేస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందని సూచించారు. అనంతరం కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ.. ఆలేరు ఎమ్మెల్యే,చైర్‌పర్సన్, కౌన్సిలర్లు,కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొనాలన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బరిగే రమ్య రామచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బూడిద మధు, బిట్టు సరోజ హరీష్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, సాధునేని ధనలక్ష్మి మధుకర్, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు ,ముక్కెర్ల మల్లేష్,బబ్బూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు వచ్చేలా చేస్తా

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- మంచి నాయకత్వాన్ని పెంచేలా కృషి చేయాలి
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- పరకాల నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే



జయభేరి, పరకాల, మే 05:

మంగళవారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంనందు పరకాల నియోజకవర్గ పరిధిలోని సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గుర్తింపు గౌరవం వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు. మండల& గ్రామ అధ్యక్షుల పదవి ఎవరికి అవకాశం వచ్చినా గౌరవించుకోండి అని, గ్రామాలలోని ప్రతి ఒక్క కార్యకర్త అభిప్రాయాలు తీసుకోవాలి తెలిపారు. జనాభా & కులాల మెజార్టీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ కమిటీ వేయాలని సూచించారు. పార్టీని విమర్శిస్తే నాయకులు అవుతారని, ప్రజలు నమ్ముతున్నారని, అలా అనుకుంటే వ్యక్తిత్వాన్ని తగ్గించుకున్నట్లే అవుతారు అన్నారు. ఎవరు అధైర్యపడవద్దు అవకాశాలు రానివారు బాధపడొద్దు అని, అది ఒకరికి అవకాశం లభిస్తుందని తెలిపారు.



# తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించండి

- రైతులకు శాస్త్రవేత్తలు శశిభూషణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ చరణ్ తేజ సూచన
- డోకూర్ లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



జయభేరి, దేవరకద్ర :

తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించడానికి రైతులు ప్రయత్నించాలని పాలెం ఆర్ ఎ ఆర్ ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ డి. శశిభూషణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. చరణ్ తేజ సూచించారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం డోకూర్ లో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు హాజరై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తక్కువ యూరియా వాడటం వల్ల నేల తల్లి ఆరోగ్యానికి కాపాడిన వారమవుతామన్నారు. అవసరం మేరకే పంటలకు రసాయనాలను వినియోగించి ప్రకృతిని రక్షించాలని సూచించారు. పంట మార్పిడి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని వారు కోరారు. మార్కెట్ లో బాగా గిరాకీ ఉన్న వరి రకాలను పండించి అధిక ఆదాయాన్ని ఆర్జించాలన్నారు. తాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందజేయాలన్నారు. సేంద్రీయ పద్ధతులను పాటించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆస్వాదించాలని రైతులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ, ఏఈఓ లతో పాటు గ్రామ రైతులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నట్లు దేవరకద్ర మండలం వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ తెలిపారు.



## మురుగు నీటి కాల్వ పనులను పరిశీలించిన సర్పంచ్

జయభేరి, కొండ మల్లేపల్లి :

కొండమల్లేపల్లి లో మేజర్ గ్రామపంచాయతీలో భారీ డ్రైనేజ్ పనులు ముమ్మురంగా కొనసాగుతున్నాయి. కోపరేటర్ బ్యాంకు పక్కన నుండి ప్రధాన మురుగు నీటి కాల్వ పనుల ను పరిశీలించిన సర్పంచ్ యుగంధర్ రెడ్డి గ్రామాన్ని ఆదర్శ తీర్చిదిద్దడమే నా లక్ష్యం సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం గా కొనసాగుతున్నాయి కొండమల్లేపల్లి లో గత కొంతకాలంగా పెండింగ్లో ఉన్నటువంటి మురుగునీటి కాలువ సమస్య పరిష్కారమే ధ్యేయంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్రధాన మురికినీటి కాలువల పనులను స్థానిక సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి ప్రారంభించి పర్యవేక్షించడం జరిగింది వర్షాకాలంలో వర్షం నీరు మరియు మురుగునీరు నిలిచిపోకుండా అధిక నాణ్యత కలిగిన పైపులతో నిర్మాణం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రధాన మురుగునీటి కాలువ పనులు మెరుగు పడటం వల్ల గ్రామంలో ప్రజలకు దోమల బెడద తగ్గి గ్రామ ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని గ్రామ సర్పంచ్ పసునూరి యుగంధర్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మా వెంకటయ్య వార్డు మెంబర్స్ బిజిలి లింగం గంట మల్లేష్ యాదవ్ కాంట్రాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్



జయభేరి, తుర్కపల్లి, మే 05 :

తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామ శివారులో గల ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై తకియోద్దీన్ పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. జడల లింగం, శ్యామల బాలకృష్ణ, ఇరగదీడ్ల అనిల్, పల్లపు అశోక్, శివరాత్రి బాబు, లను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుండి 11200 నగదు, రెండు సెట్ల పేకా ముక్కలు, రెండు మోటార్ సైకిల్లు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకుని అతి వ్యక్తులను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పేకాట అసాంఘిక చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కేసీఆర్ పై రసమయి బాలకిషన్ తిరుగుబాటు?

- ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు

జయభేరి, హైదరాబాద్ :

కేసీఆర్ వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని బీఆర్ఎస్ నేత రసమయి బాలకిషన్ సంచలన వ్యాఖలు చేసారు. ఉద్యమ ద్రోహులను దగ్గరికి తీసుకున్నడు. నాలాంటి వాళ్లను పక్కనబెట్టి, తెలంగాణ ఉద్యమంపై రాళ్లేసినవారికే పదవులిచ్చిండు. నేను ఎమ్మెల్యేగా ఉంటే తలసానిని మంత్రిని చేసిండు. ప్రజలు అది జీర్ణించుకోలేదు. కేసీఆర్ పతనం అక్కడే మొదలైందని అయన అన్నారు.

# దోపిడీ వెనుక ఆ ముఠా..

**జయభేరి, కరీంనగర్, మే 5 :**



ప్రశాంతతకు మారుపేరైన ఆ నగరం ఉలిక్కిపడింది. నిత్యం రద్దీగా ఉండే ఆ వీధి, పసిడి కాంతుల మధ్య వెలిగిపోయే ఒక వాణిజ్య సముదాయం అల్లకల్లోలంగా మారింది. ఆయుధాలతో వచ్చిన దుండగులు క్షణాల్లో చేసిన అలజడి కేవలం ఆస్తి నష్టాన్ని మాత్రమే కాదు.. పౌరుల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తారు. పట్టపగలే కాల్పుల శబ్దాలతో దద్దరిల్లిన ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొనగా, అప్పటి వరకు సాధారణంగా సాగిపోతున్న జనజీవనం స్తంభించింది. ఇప్పుడు ఆ ముఠా ఎక్కడుంది? ఎటు వెళ్లింది? అన్న ఉత్కంఠ నెలకొన్న తరుణంలో, పోలీసులు ఒక కీలకమైన ప్రకటనతో ముందుకు వచ్చారు మాజీ ఎమ్మెల్యే కుమారుడికి షాకిచ్చిన పోలీసులు కరీంనగర్‌లో కలకలం రేపిన పీఎంజే చోరీ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ నగరంలోని రద్దీ ప్రాంతంలో పీఎంజే జువెలరీ షాపులో జరిగిన కాల్పులు, చోరీ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. నిందితులు పక్కా ప్లాన్‌తో వచ్చి, సిబ్బందిని బెదిరించి బంగారం అపహరించడమే కాకుండా కాల్పులకు తెగబడడం పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై స్పందించిన పోలీస్ శాఖ, నిందితుల వేటను ముమ్మరం చేసింది. ఘటనా స్థలంలో సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సాక్ష్యాల ప్రకారం.., ఇది ఒక ప్రణాళికాబద్ధమైన నేరమని అధికారులు నిర్ధారించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ కేసు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. బయటపడ్డ ముఖచిత్రాలు నేరం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, జువెల్లరీ, పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఐదుగురు నిందితులకు సంబంధించిన స్పష్టమైన చిత్రాలు సేకరించారు. ఈ ఫుటేజీ ఆధారంగా నిందితుల ముఖచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. ప్రజలు ఈ ముఖాలను గుర్తించి, పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ఈ నిందితులు ఎక్కడైనా తలదాచుకొని ఉండవచ్చని, వారిని పట్టుకోవడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ముఖచిత్రాల విడుదల చేసి వారు తప్పించుకునే మార్గాలను మూసివేయాలని అధికారులు భావిస్తున్నారు దర్యాప్తులో తేలిన మరో దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే, ఈ చోరీకి పాల్పడింది ఒక అంతర్రాష్ట్ర ముఠా అని గుర్తించారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి, రెక్కీ నిర్వహించి నేరానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ప్రమాదకరమైన ముఠాను పట్టుకోవడానికి 12 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక్కో బృందం ఒక్కో కోణంలో గాలింపు చేపడుతోంది. సరిహద్దు ప్రాంతాలతో పాటు, నిందితులు వెళ్లేందుకు అవకాశం ఉన్న అన్ని రహదారులను జల్లెడ పడుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి సెల్ ఫోన్ సిగ్నల్స్, ప్రయాణ మార్గాలను విశ్లేషిస్తున్నారు. ఆచూకీ తెలిపితే లక్ష ఈ కేసులో పురోగతి సాధించేందుకు పోలీసులు ప్రజలకు భారీ ఆఫర్ ప్రకటించారు. నిందితుల ఆచూకీ తెలిపిన వారికి లేదంటే ఎక్కడ ఉన్నారో సమాచారం అందించిన వారికి రూ. 1,00,000 (లక్ష) నగదు అందజేస్తామని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. నిందితుల కదలికలపై అనుమానం ఉన్న వారు స్పందించాలని, తద్వారా ఈ అంతర్రాష్ట్ర నేరగాళ్లను కటకటాల్లోకి నెట్టే అవకాశం ఉంటుందని పోలీసులు పిలుపునిచ్చారు. సంప్రదించాల్సిన నంబర్లు నిందితుల గురించి సమాచారం తెలిసిన వారు నేరుగా పోలీసు అధికారులకు ఫోన్ చేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా 8712670762, 8712670711, 8712670713 నంబర్లను కేటాయించారు. ఈ నంబర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని, ఏ చిన్న సమాచారం అయినా కేసు దర్యాప్తునకు సహాయపడుతుందని పోలీసులు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో పౌర సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసులకు తోడ్పాటు అందించాలని కోరుతున్నారు. ఈ సాహసోపేత చర్య ద్వారా నేరగాళ్లను పట్టుకొని, నగరంలో మళ్లీ మునుపటి ప్రశాంతతను నెలకొల్పడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోంది.



## కురుమూర్తి దేవస్థానం పాలకమండలి కార్యవర్గానికి ఎమ్మెల్యే జిఎంఆర్ శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం నూతన పాలక మండలి కార్యవర్గానికి మంగళవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాలక మండలి కార్యవర్గానికి ఎమ్మెల్యే జీవోను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్,ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల సమీక్ష



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మరియు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ల ఆధ్వర్యంలో మంగళవారం అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్ లు, మున్సిపల్ వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు తదితర ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్తు రోడ్లతో పాటు గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు కలెక్టర్ మరియు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకవచ్చారు. అట్టి సమస్యలపై అధికారులతో వారు చర్చించి పలు సమస్యలను తక్షణమే పరిష్కరించారు. మిగతా సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే జిఎంఆర్ కోరినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## చదువు కోవడం కొరకు ఆర్థిక సహాయం

- ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్



**జయభేరి, గుడిపల్లి :**

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశాలతో పోలె మహేందర్ కూతురు మెడిసిన్ చదువుకు ఖర్చుల నిమిత్తం ఒక లక్ష (1,00,000/) రూ.లు ఆర్థిక సహాయం అందచేసిన ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్ గుడిపల్లి మండల పరిధిలోని కోదండాపురం గ్రామంలో గత కొద్దీ కాలం క్రితం మరణించిన పోలె మహేందర్ కుటుంబానికి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశానుసారం వారి కార్యాలయంలో లక్ష (1,00,000/) రూ.లు పోలె మహేందర్ కూతురు మెడిసిన్ చదువు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ పార్టీ గుడిపల్లి మండల నాయకులు, యాదాద్రి ఇన్ఫ్రా చైర్మన్ ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్ పోలె మహేందర్ కుటుంబసభ్యులు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కి, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్ కి, కృతజ్ఞతలు తెలియజేశారు.

## తక్షణమే సంపులు మరమతులు చేయాలి

- ఆరు సంపులకు గాను కేవలం రెండు సంపుల ద్వారా మిషన్ భగీరథ నీరు
- మిషన్ భగీరథ నీరు రాక గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు



**జయభేరి, గుడిపల్లి :**

కోదండపురం మిషన్ భగీరథ నీటి సరఫరా సంపులను మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు సంపులకు గాను కేవలం రెండు సంపుల ద్వారా మాత్రమే నీరు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు.మిషన్ భగీరథ నీరు మిషన్ భగీరథ నీరు రాక గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు.నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు అని ఆయన తెలిపారు.తక్షణమే సంపులు మర్మతులు చేయాలి ఆయన డిమాండ్ చేశారు.



## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

- పంపిణీ చేస్తున్న సర్పంచ్ సోమల వెంకటేశం

**జయభేరి, తుర్కపల్లి, మే 05 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, కూల్ వాటర్ ను గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మంది ఉపాధి హామీ కూలీలు నిత్యం ఎండలో చేస్తున్నారని వారికి మజ్జిగ ప్యాకెట్లను, కూల్ వాటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్ చాంద్ పాషా, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- దేవరకద్రలో ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సభ



**జయభేరి, దేవరకద్ర :**

రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సూచించారు. దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక మార్కెట్ యార్డ్ లో ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకే రకమైన పంటలు కాకుండా మూడు, నాలుగు రకాల పంటలు సాగు చేస్తే రైతులకు ఎంతగానో లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా వివిధ రకాల పండ్లు, పూలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేపట్టేలా హార్టికల్చర్ అధికారులు రైతులకు కావలసిన అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సుచించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కూరగాయలు, పండ్ల స్టాల్స్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ ధమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి లతోపాటు స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయ్ కు అంత ఈజీ కాదు






- ముందున్న మొసళ్ల పండుగ

**జయభేరి, చెన్నై, మే 5 :**

విజయ్ పార్టీ గెలిచింది. తను కూడా రెండు స్థానాలలో పోటీచేసి గెలిచాడు. అతిపెద్ద పార్టీగా అవతరించి.. అధికారంలోకి రాగలిగాడు. ఒక మంచి రోజు చూసుకొని తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తాడు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి 6 నెలలపాటు హనీమూన్ పీరియడ్ ఉంటుంది. ఆ తర్వాత అసలు సవారి మొదలవుతుంది. ప్రతిపక్షాలు అప్పటిదాకా ఎదురుచూస్తాయి. ఆ తర్వాత విమర్శలు మొదలు పెడతాయి. రాజకీయం అంటేనే అలా ఉంటుంది కదా.. అప్పటిదాకా విజయ్ ని అభిమానించిన వారు విమర్శలు చేస్తారు. ఏక వాక్యంతో సంబోధిస్తారు. అవసరమైతే వ్యక్తిగత విషయాలను కూడా లాగుతారు. పైగా తమిళనాడు రాజకీయాలు అత్యంత దారుణంగా ఉంటాయి.విజయ్ ఎన్నికల ప్రచారంలో తమిళ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు.. మహిళలకు ప్రతినెల 2500 ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. పెళ్ళికానుకగా వధువుకు ఎనిమిది గ్రాముల బంగారం, పట్టుచీర ఇస్తామని వెల్లడించారు. ఉద్యోగాలు లేని గ్రాడ్యుయేట్లకు ప్రతినెల 4000 రూపాయల భృతి ఇస్తామని వెల్లడించారు. దివ్యాంగులకు, వృద్ధులకు ప్రతినెల 3000 పింఛన్ ఇస్తామని చెప్పారు. ఏడాదికి ఆరు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. కొత్తగా 5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుకోవడానికి విద్యార్థులకు 20 లక్షల వరకు రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఐదు లక్షల మందికి పెయిడ్ ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. స్కూల్ కి వెళ్లే పిల్లలు ఉన్న తల్లులకు ప్రతి ఏడాది 15000 చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఐదు ఎకరాలకు పంట భూములు ఉన్న రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు.ఈ హామీలు తమిళ ప్రజలను విజయ్ వైపు చూసేలా చేశాయి. తమిళనాడులో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాజకీయ పార్టీ నాయకులు సరికొత్త విధానాన్ని అవలంబిస్తారు.

గతంలో కరుణానిధి, జయలలిత ఓటర్లకు టీవీలు, కుక్కర్లు, వాషింగ్ మిషన్లు కూడా ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజలను సోమరులను చేయడానికి తమిళనాడు నాయకులు గట్టిగానే కంకణం పట్టుకున్నారు. విజయ్ హామీ ఇచ్చినట్టుగా తమిళ ప్రజలకు ఆ పథకాలు మొత్తం అమలు కావాలంటే లక్షల కోట్ల బడ్జెట్ కావాలి. తమిళనాడు పెద్ద రాష్ట్రం. మన దేశానికి ఆర్థికంగా బలమైన సపోర్ట్ ఇస్తున్న రాష్ట్రాలలో ముందు వరుసలో ఉంటుంది. కాకపోతే తమిళనాడు ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఏమాత్రం బాగోలేదు. తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి 2024 ,25 ఆర్థిక సంవత్సరానికి గాను స్థూల రాష్ట్ర దేశ ఉత్పత్తి 31.55 లక్షల కోట్లుగా ఉంది. 2025,26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీఎస్డీపీ శాతం 35,67,818 కోట్లుగా ఉంది.. రాష్ట్ర బడ్జెట్లో (మూడు శాతం) ఆర్థిక లోటు 1,06,968 కోట్లుగా ఉంది. రాబడి లోటు (1.2%) 41,635 కోట్లుగా ఉంది.2025, 26 బడ్జెట్ అంచనా వ్యయం 4,39,293 కోట్లుగా ఉంది.. రాబడి లోటు, ఆర్థిక లోటు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో.. విజయ్ తన ముందు ఉన్న సవాళ్ళను ఎలా ఎదుర్కొంటారో చూడాల్సి ఉంది. రాష్ట్ర వనరుల నుంచి 75.3, కేంద్ర పన్నులు, గ్రాంట్ల నుంచి 24.7 శాతం రాబడిని తమిళనాడు ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఇది ఆచరణలో సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు.

# లాయర్ పాత్రలో కాజల్



కాజల్ అగర్వాల్ లాయర్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది ఇండియా స్టోరీ'. చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాగర్ బి షిండే నిర్మిస్తున్నారు. జూలై 24న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. పంటసాగులో పురుగు మందుల వినియోగం, పెస్టిసైడ్స్ కంపెనీల కుంభకోణాల నేపథ్యంలో రైతు సమస్యల్ని, సమకాలీన అంశాల్ని చర్చిస్తూ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వ్యవస్థలోని అవినీతిపై పోరాడే న్యాయవాదిగా కాజల్ అగర్వాల్ కనిపించనుంది. రసాయనాల దుర్వినియోగం కేవలం పర్యావరణ సమస్య కాదని, అది మానవ సంక్షోభానికి దారితీస్తుందని, ఈ సినిమా ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించబోతున్నామని నిర్మాత సాగర్ బి షిండే తెలిపారు. నిజాయితీగా చేసిన ప్రయత్నమిదని, సందేశంతో పాటు వినోదాత్మక అంశాలుంటాయని దర్శకుడు చేతన్ డీకే చెప్పారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా శ్రేయస్ తల్పదే నటిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నది.




# వెంకటేష్ డైట్ సీక్రెట్ ఇదే..

## ఐదేళ్లు ఆయనతో పనిచేశా కాబట్టి చెబుతున్నా..


తెలుగు సినిమా పరిశ్రమలో దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న చంద్ర మహేష్, ఇటీవల ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ఇంటర్వ్యూలో విక్టరీ వెంకటేష్ వ్యక్తిత్వం, నిర్మాత సురేష్ బాబుతో తన అనుబంధం, తన శిష్యులుగా పనిచేసి నేడు అగ్ర దర్శకులుగా రాణిస్తున్న వారి గురించి అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. వెంకటేష్ బాబు గురించి మాట్లాడుతూ, ఆయన మొదటి నుండి డివోషనల్ గా, ఆధ్యాత్మికంగా ఉండేవారని, లోకేషన్ లో ఎక్కువ మెడిటేషన్ చేస్తూ లేదా నిశితంగా పరిశీలిస్తూ ఉండేవారని చంద్ర మహేష్ తెలిపారు. అప్పట్లో వెంకటేష్ అంత ఓపెన్ అయ్యేవారు కాదని, రిజర్వ్డ్ గా ఉండేవారని, ఇప్పుడు ఆ ఆధ్యాత్మిక స్వభావం అందరికీ స్పష్టంగా తెలుస్తోందని వివరించారు. నిర్మాత సురేష్ బాబుతో తనకున్న బలమైన బంధాన్ని, వారిద్దరి మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని గురించి చంద్ర మహేష్ ప్రస్తావించారు. శివయ్య సినిమా కథ సెట్ కావడానికి తనే కారణమన్న చంద్ర మహేష్, ఆ సినిమా పెద్ద హిట్ అయినప్పుడు సురేష్ బాబు తనను ఎంతగానో మెచ్చుకున్నారని గుర్తు చేసుకున్నారు. "మేము వద్దన్నాము మా నాన్నని సినిమా చేయొద్దు అన్నాము. సరే మహేష్ వాళ్ళతో... చేద్దాం అని అన్నారట. ఏదో మంచి కథ తెచ్చి చేశారు. ఎలాగో హిట్ కొడతారులే అనుకున్నాను. పెద్ద హిట్ కొట్టారు. ఇటువంటి స్టాఫ్ నాకు అవసరం" అని సురేష్ బాబు అన్న మాటలను పంచుకున్నారు. ఇటీవల సురేష్ బాబును కలిసినప్పుడు, "నీలాగా పని చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ నువ్వు వెళ్ళిపోయిన తర్వాత నాకు దొరకలేదయ్యా. అలా నీలాగా బాధ్యతగా ఉన్న డైరెక్టర్ కూడా నాకు దొరకలేదు" అని సురేష్ బాబు తనపై ఉన్న నమ్మకాన్ని చెప్పినట్లు చంద్ర మహేష్ తెలిపారు. మంచి స్క్రిప్ట్ తో మళ్ళీ సినిమా చేయమని సురేష్ బాబు ప్రోత్సహించారని ఆయన చెప్పారు. తన స్టూడియోలో మహేష్ లాంటి కమిట్మెంట్ ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్లను వెతకమని మేనేజర్లకు సురేష్ బాబు చెబుతుంటారని కూడా చంద్ర మహేష్ వెల్లడించారు. వెంకటేష్ ఇప్పుడు మాత్రమే కాదు, కెరీర్ ప్రారంభం నుండి కూడా చాలా ఆధ్యాత్మికంగా ఉండేవారని చంద్ర మహేష్ తెలిపారు. షూటింగ్ సమయాల్లో కూడా ఖాళీ దొరికితే ధ్యానం చేసుకునేవారని, చాలా రిజర్వ్డ్ గా ఉండేవారని పేర్కొన్నారు. తన బాడీని మెయింటైన్ చేయడానికి చాలా కఠినమైన ఆహార నియమాలను పాటిస్తారని డైరెక్టర్ వివరించారు. ఆయన షూటింగ్ లొకేషన్‌లో తన ఇంటి నుండి తెచ్చుకున్న ప్రత్యేకమైన ఆహారాన్ని మాత్రమే తీసుకునేవారు. ఆయన డైట్ లో ఎక్కువగా ఆయిల్ లేని పదార్థాలు, ఉడికించిన కూరగాయలు, తక్కువ క్యాలరీలు ఉండే ఆహారం ఉండేది. ఫారిన్ నుండి వచ్చిన కొత్తలో కూడా ఆయన తన ఫిజిక్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవారని, అందుకే ఇప్పటికీ అంత ఫిట్ గా ఉన్నారని చెప్పారు.

# పోలీస్ ఆఫీసర్ తిరుపతి తడాఖా



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రలుగా రూపొందుతున్న థ్రిల్లర్ మూవీ 'కామాఖ్య'. అభినయ కృష్ణ దర్శకుడు. వడ్డేపల్లి శ్రీవాణీనాథ్‌ర, యశ్వంత్ రాజ్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఇందులో సముద్రఖని 'తిరుపతి' అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు.ఆదివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోలీస్ ఆఫీసర్ తిరుపతిగా అద్భుతమైన స్క్రీన్ ప్రెజన్స్‌తో సముద్రఖనిని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రమేశ్ కుశేందర్‌రెడ్డి, సంగీతం: గ్యాని, నిర్మాణం: మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ ప్రై.లిమిటెడ్.

# మెక్సికో నుంచి బ్రెజిల్ వరకు 'వారణాసి' గ్లోబల్ హంగామా.. రాజమౌళి భారీ ప్లాన్!




సూపర్ స్టార్ మహేష్ బాబు - దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' రిలీజ్‌కు ముందే అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తోంది. భారతీయ సినిమా హద్దులను దాటి గ్లోబల్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ ఈ చిత్ర బృందం ప్రచారాన్ని విదేశాల్లో వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. ఇటీవల మెక్సికోలో జరిగిన ప్రముఖ కామిక్ కాన్ మెక్సికో ఈవెంట్‌లో 'వారణాసి'కు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌తో పాటు రాజమౌళి పంపిన వీడియో సందేశం ప్రదర్శించగా, అక్కడి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. సినిమాలో ఉపయోగిస్తున్న అత్యాధునిక సాంకేతికత, గ్రాండియర్ విజువల్స్ చూసి అంతర్జాతీయ సినీ ప్రియులు ఆశ్చర్యపోయినట్లు సమాచారం. ఈ స్పందనతో ఉత్సాహంగా ఉన్న చిత్ర బృందం ఇప్పుడు బ్రెజిల్‌లో భారీ ప్రమోషన్స్‌కు సిద్ధమవుతోంది. లాటిన్ అమెరికా మార్కెట్‌లో సినిమాపై హైప్ పెంచేందుకు బ్రెజిల్‌ను కీలక వేదికగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. గతంలో రాజమౌళి తెరకెక్కించిన RRR అక్కడ భారీ క్రేజ్ సంపాదించుకోవడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ గ్లోబల్ ప్రమోషన్ వెనుక రాజమౌళి పక్కా వ్యూహం పనిచేస్తోంది. సినిమా షూటింగ్ దశలోనే అంతర్జాతీయ ఈవెంట్లలో ప్రమోషన్ చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా డిస్ట్రిబ్యూటర్ల దృష్టిని ఆకర్షించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. బ్రెజిల్‌లో జరగబోయే ఈ ప్రచార కార్యక్రమంలో మహేష్ బాబు వర్చువల్‌గా పాల్గొనే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది.
యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతున్న 'వారణాసి'ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో రూపొందించేందుకు చిత్ర బృందం తీవ్రంగా శ్రమిస్తోంది. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో మహేష్ బాబు కొత్త లుక్‌లో కనిపించనున్నారు. లాంగ్ హెయిర్, రఫ్ ఫిజిక్‌తో ఆయన గెటప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక ఈ సినిమా విషయంలో రాజమౌళి అనుసరిస్తున్న గోప్యత కూడా ఆసక్తికరంగా మారింది. కామిక్ కాన్‌లో చూపించిన విజువల్స్ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీ పెంచుతున్నారు. ఈ సైలెంట్ మార్కెటింగ్ స్ట్రాటజీ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఏది ఏమైన బ్రెజిల్ ప్రచారం తర్వాత 'వారణాసి'పై గ్లోబల్ స్థాయిలో మరింత హైప్ పెరగడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.



# విశాల్‌కి జోడీగా..

తమిళ అగ్రహీరో విశాల్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మకుటం'. సూపర్‌గుడ్ ఫిల్మ్స్ పతాకంపై 99వ సినిమాగా ఆర్బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. అంజలి ఇందులో విశాల్‌కి జోడీగా నటిస్తున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. అంజలి, విశాల్ కలిసి ఓ కాన్సెప్ట్ వీడియోని విడుదల చేశారు. అంజలికి కథ చెప్పేందుకు ఒక దర్శకుడిగా విశాల్ వెళ్లడంతో ఈ వీడియో మొదలైంది. వీడియోలో ఇద్దరి సంభాషణ సెటైర్లతో ఫన్‌గా సాగింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నదని మేకర్స్ తెలిపారు. విశాల్ హీరోగా నటిస్తూ కథ, కథనం, దర్శకత్వం బాధ్యతల్ని కూడా నిర్వర్తిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**